# లలిత

## ఉషారాణి

'ఎందుకిలా జరిగింది' పదేపదే అనుకుంది లలిత. గొప్పగా కాకపోయినా చిన్నప్పటినుంచి తనను బాగానే చూశారు తల్లిదండ్రులు. తమ శక్తికి తగ్గట్టు రెండువేలు కట్నమిచ్చి సూర్యంతో తన వివాహం జరిపించారు. అతనికి తల్లిలేదు తండ్రి ఒక చెల్లెలు ఉన్నారు తమవద్ద తీసుకున్న కట్నం డబ్బుతో సూర్యం తండ్రి కూతురి పెళ్ళి చేశాడు. అయినా తను ఏమాత్రం బాధపడలేదు. భర్త తనని అభిమానిస్తే చాలనుకుంది. తను కాపురానికి వచ్చి ఒక్క నెల అయింది. పెళ్ళిఅయి మూడు నెలలు, ఈ మూడు నెలలలో లలిత భర్త మనసు ఏమిటో కాస్తయినా అర్థం చేసుకోలేక పోయింది.

సూర్యం పనిచేసేది చిట్ ఫండ్ కంపెనీలో. ఉదయంనుంచి సాయంత్రం వరకూ అతను అందరిళ్ళకు తిరిగి, డబ్బు కట్టించుకుంటాడు. జీతం నూటఅరవై. చిన్నపాత పెంకుటిల్లు తక్కువలో అద్దెకు తీసుకున్నాడు. మునికొండలోఉన్న ఎకరం మాగాణిని సూర్యం తండ్రి చూస్తూంటాడు. ఎన్నో ఆశలతో వచ్చిన లలిత మొదట తమ ఇంటిని చూడగానే నిరుత్సాహ పడింది.

సూర్యం ఉదయం తొమ్మిది గంటలకు వెళ్ళి సాయంత్రం ఆరింటికి కానీ రాడు. లలిత తొమ్మిది లోపల పనంతా ముగిస్తుంది మధ్యకాలమంతా లలిత ఒంటరిగా ఉండాలి భర్తకోసం ఎదురు తెన్నులు చూడటమే ఆమె పని. లలితతో సూర్యం ముక్తసరిగా మాట్లాడుతాడు. అంటీ అంటనట్లు ప్రవర్తిస్తాడు. కొత్త భార్యన్న మోజు అతని కేమాత్రం లేదు. లలిత అందమైనది ఆమె అందం అతన్ని కదిలించలేక పోయింది ఎన్నో ఆశలతో. కోటి కోర్కెలతో సూర్యంతో అగ్ని సాక్షిగా మూడుముళ్ళు వేయించుకున్న లలితకు అతని ప్రవర్తన గొడ్డలి పెట్టు. భర్త ఆంతర్యం అర్థం కాక సతమతమవుతోంది.

ఎదురింటివారి గోడ గడియారం రంగున ఐదు గంటలు కొట్టింది, లలిత ఉలిక్కిపడి ఆలోచనలోంచి తేరుకుంది. ఎదురింటి గడియారం మనసులో కదిలింది. తమ ఇంట్లో చిన్న అలారం టైంపీస్ అయినా లేదు. భర్త చేతిని వాచీలేదు. అతనికి వచ్చే జీతం ఖర్చులకే చాలవు నిట్టూరుస్తూ లేచింది.

తండ్రి తనకు కుంపటి కొనిచ్చాడు కానీ దానికి కావలసిన బొగ్గులు ఎంత కాలం కొనివ్వగలడు. భర్త పుల్లలపొయ్యి పెట్టమన్నాడు.

ఎంతో అవస్థతో పుల్లలపొయ్యి వెలిగించింది. భగభగలాడుతున్న ఆ మంటలో తన ఆశలన్నీ అహూతి అయిపోయినట్లనిపించింది. పనంతా చేసి నీట్‌గా రెడీ అయి పూలు కొనుక్కొని పెట్టుకుని భర్తరాక కోసం నిరీక్షించసాగింది.


* * *

చిరాకు మొహంపై చిందులాడుతున్నట్లుగా వచ్చాడు సూర్యం. సైకిల్ దిగుతూ లలితవేపు చూసాడు. ఒక్కసారి అతని మనసు చివుక్కుమంది. ఆమె పెట్టుకున్న పూలపై సూర్యం చూపు పడింది. లలితను చిఱునవ్వుతో వీక్షించలేదు. ఆప్యాయంగా మాట్లాడి అప్పటి వరకూ ఆమె వెన్నంటి ఉన్న వంటరితనాన్ని పోగొట్టలేదు. లలిత తోడి ఉంచిన నీళ్ళతో స్నానం చేసి పక్కపై వాలిపోయాడు

లలితకు గొంతులో ఏదో అడ్డుపడ్డట్టు అయింది. అది దుఃఖం భర్త తనను పలకరించలేదు. సినిమాలలోలా, కథలలోలా వస్తూనే తనను దగ్గరకు తీసుకోలేదు. కనీసం చిఱునవ్వు పలకరింపైనా లేదు. అలసటగా పడుకున్న సూర్యం ముఖం చూడగానే తన అర్థం లేని అపోహలకు హృదయం కలుక్కుమంది. పాపం ఎండలో పగలంతా కాళ్ళు అరిగేట్లు తిరిగి వస్తే తనింత స్వార్థంగా ఆలోచిస్తోందా? ఆ క్షణంలో సూర్యంపై ఎంతో జాలి కలిగింది. అతని ప్రక్కగా కూర్చుని పిలిచింది.

"ఏమిటి?" కళ్ళుమూసుకునే అడిగేడు.

"బాగా చీకటి పడింది. ఆకలిగాలేదూ, రండి భోజనం చేద్దాం" అనునయంగా అంది.



డైనా తినొచ్చు. ఎండలో కష్టపడి వచ్చిన వాడిని కాసేపైనా నన్ను పడుకోనివ్వవా?" విసురుగా అన్నాడు

లలిత మఱి మాట్లాడకుండా నిశ్శబ్దంగా వాకిట్లోకి వచ్చింది. కడుపులో ఆకలి దహిస్తోంది పొద్దున్న పది గంటలకు తిన్న అన్నం. మధ్యలో కనీసం కాఫీ అయినా ఉండదు. ఒక్క సీసా పాలు తెస్తారు ఉదయం కాఫీ తాగుతారు మిగిలిన పాలు తోడువేసి రాత్రికి, మర్నాటి ఉదయానికి మజ్జిగగా వాడుతారు టిఫెన్ చేసుకుందామన్నా అవసరమైన వస్తువులు ఇంట్లో ఉండవు భర్త లేకుండా తినాలన్నా లలితకు ఇష్టం ఉండదు అతనికి ఆదివారం లేదే. ఆ రోజైనా ఇంట్లో ఉండడు. లలితతో కబుర్లు చెప్పక, ఒక్క పిక్చర్ కన్నా తీసుకు వెళ్ళక ఆదివారం కూడా తను వచ్చిన ఈ నాలుగు వారాలు భర్త ఎక్కడకు వెళ్ళింది లలితకు అర్థంకాలేదు. పేకాటకు వెళ్తాడని తెలియదు. రేపు ఆదివారం రేపైనా ఆయన్ని బ్రతిమాలి ఇంట్లో ఉంచాలి అనుకుంది లలిత.

*     *     *

ఉదయం లలిత సూర్యానికి కాఫీ ఇచ్చి తన కాఫీ గ్లాస్‌కూడా తెచ్చుకుంది, అది చూసిన సూర్యం మనసు బాధపడింది.

'లలిత ఎప్పుడు ఇంట్లోనే నీడ పట్టున కూర్చుంటుంది. తను ఎండలో రోజంతా తిరిగే వ్యక్తి. లలిత కాఫీ త్రాగకపోతే ఏమౌతుంది? ఆమె కాఫీ త్రాగకుండా


గ్రామ్స్ "KILPEST"     ఫోన్స్ ఆఫీస్ · 74269 ఫ్యాక్టరీ 86-368

# అశోక్ పల్వరైజర్స్

అన్ని రకముల పెస్టిసైడ్స్ మరియు ఇన్‌సెక్టిసైడ్స్ ఉత్పత్తిదారులు
బి. హెచ్ సి డి. డి టి, మలథియాన్ ఎండ్రిన్ మొ॥ నవి.

| ఆఫీసు | ఫ్యాక్టరీ |
|---|---|
| లక్ష్మీభవన్ | డి-11 యూనిట్ |
| శివాలయం వీధి | ఇండస్ట్రియల్ ఎస్టేట్ |
| సత్యనారాయణ పురం | పటమట |
| విజయవాడ-2 | విజయవాడ-7 |

ఉంటే ఎండలో అలసి వచ్చిన తను మటి కొంచెం మజ్జిగ త్రాగొచ్చుకదా' లలితకీ విషయం ఎలా చెప్పటం? నువ్వు కాఫీ త్రాగకపోయినా పరవాలేదనీ, ప్రమాదమేం లేదనీ ఎలా చెప్పాలి?' అనుకున్నాడు.

సూర్యంది వింత మనసు. ఎంతసేపూ తను కష్టపడుతున్నాడు లలిత హాయిగా జీవిస్తోందని అతని ఆలోచన. తండ్రితో ఉన్నప్పుడూ ఇలాగే ఆలోచించేవాడు. కానీ తండ్రి నేర్పుగా అతన్ని లొంగదీసుకున్నాడు. అందుకే అతనికి కట్నంగా వచ్చిన డబ్బుతో కూతురి పెళ్ళి చేయగలిగేడు.

తొమ్మిది కావస్తోంది లలిత వంట గదిలో పని చేసుకుంటోంది. రెండు గదుల పాతకాలపు పెంకుటిల్లు వీళ్ళది సూర్యం తొమ్మిదింటిదాకా దర్జాగా పడుకుని అప్పుడు హడావుడిగా లేచాడు. పెరటిలో నావి ఉంది. ఒక్క బకెట్ నీళ్ళన్నా సూర్యం తోడడు. పనిమనిషి లేదు. లలితే నీళ్ళు తోడుతుంది, స్నానం ముగించి భోజనానికి కూర్చున్నాడు. లలిత అతనికి వడ్డించి కొంత కూర గిన్నెలో ఉంచేసింది.

సూర్యం వదనం వివర్ణమైంది. 'ఏం తను కూర లేకుండా పచ్చడితో తినలేదా? ఇంట్లో హాయిగా తీరి కూర్చునే దానికి కూర ఎందుకు? ఆ కూర నాకుపెడ్తే మటి కొంచెం అన్నం తిననా?' అనుకున్నాడు.

ఆవేశం ఆపుకోలేక "ఆ కూర ఎవరికి?" అన్నాడు

వింతగా చూస్తూ "నాకు ఏం?" అంది

"ఊరికే అడిగాను" ముభావంగా అన్నాడు

సూర్యం వెళ్ళబోయే ముందు "ఒక్క పది పైసలు ఇచ్చి వెళ్ళండి" అడిగింది లలిత


# శ్రీ బాలాజీ వైద్యశాల



## సెక్సు స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర

మార్వాడి గుడివద్ద; ఫోన్ 551, తెనాలి (ఏ. పి.)

బ్రాంచి. 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

## దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యము

హస్త ప్రయోగం, అతి సంభోగం వలన అంగము చిన్నదై సంభోగ కాలమందు అకస్మాత్తుగా అంగము కృశించుట, శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ కని విని ఎరుగనంత వీర్య స్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులు వాడతగినది. స్వస్థులు), హెర్నియా (గిలక), కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టుద్వారా కూడా నయం చేయబడును. వరిబీజము (బుడ్డ), మూత్రవ్యాధులకు ఆపరేషన్ లేకుండా నయం చేయబడును. స్వయంగా రండి. క్షయ, ఉబ్బసమునకు ఉచితం రండి.

"దేనికి?" విసుగ్గా ఇడిగాడు.

"నాకు పూలంటే ఇష్టం. సాయంత్రం కొని పెట్టుకుంటాను" చిన్నతనంగా చెప్పింది. పది పైసలకు వివరం అడిగే భర్తను అసహ్యించుకోకుండా ఉండటానికి ప్రయత్నిస్తూ.

సూర్యం మనసు ఆలోచనలో పడింది. పది పైసలు మరొక పది పైసలు జేరిస్తే మధ్యాహ్నం ఎండలో తనకు టీ వస్తుంది. పాడు పువ్వులు పదిపైసలు తగలేస్తే పది నిముషాలలో వాడిపోతాయి.

"నా దగ్గిర చిల్లర లేదు" అనేసి ముందుకు కదలిపోయాడు. లలిత కు దుఃఖం ముంచుకు వచ్చింది

* * *

సాయంత్రం సూర్యం వచ్చేసరికి లలిత పనులన్నీ చేసి అందంగా అలంకరించుకుంది

ఆమె సిగలోని పూలను చూసి సూర్యం భృకుటి అనుమానంగా ముడిపడింది.

"పూలు ఎక్కడివి?" సూటిగా అడిగాడు.

"బట్టలు ఉతుకుతుంటే మీ పాంట్ జేబులో ఇరవై పైసలు కనిపించినయి" అందంగా మందహాసం చేస్తూ చెప్పింది

సూర్యం పనిమనిషిని కానీ, చాకలిని కానీ పెట్టలేదు. ఇంట్లో అన్ని పనులూ లలితే చేస్తుంది,

సూర్యం రుసరుస లాడుతూ స్నానం చేసి పడుకున్నాడు.

"ఏమండీ! పొద్దుటినుంచీ ఎప్పుడు వస్తారా అని మీ కోసం ఎదురు చూస్తుంటాను. వచ్చారుగా.ఏదైనా మాట్లాడండీ!" దిగులుగా అన్నది.

"దర్జాగా నువ్వు ఇంట్లో కూర్చుంటావు. నేను చచ్చే చాకిరీ చేసే మనిషిని. నీతో కబుర్లు చెప్పటమేనా నా పని.నన్ను కాసేపు పడుకోనివ్వు'' కసురుకున్నాడు.

* * *

ఆ రోజు ఎదురింటివారు వాళ్ళ పాప పుట్టిన రోజని స్వీట్స్ పంచారు.

జాంగిరీ, జిలేబీ, రెండు లడ్డులు ఇచ్చారు. లలిత వాటిని రెండు ప్లేటులో పెట్టి తీసుకువచ్చింది.

అది చూడగానే సూర్యం మనసు మండింది. తనుకూడా తినాలా? తిరిగి తిరిగి వచ్చిన నాకు పెట్టకూడదా? అనుకుంటూ లలిత తనకివ్వబోతున్న ప్లేట్‌ను విసురుగా లాక్కున్నాడు

అతని చర్యకు లలిత విస్తుపోయింది.

* * *

లలిత, సూర్యంల సంసారాన్ని దాటుకుంటూ ఐదారు నెలలు గడిచాయి. సూర్యం ఆలోచనలో ఏమాత్రం మార్పు రాలేదు. వాటిని ఆచరణలో పెట్టటం నేర్చుకున్నాడు

నిర్మొహమాటంగా తన అభిప్రాయాలు చెప్తున్న భర్తను చూస్తుంటే లలితకు మతిపోతోంది "ఈయన మనిషేనా"? అనే భయంకర అనుమానం మొలకెత్తటంతో శరీరం గగుర్పాటుతో జలదరించింది.

అప్పటి నుండి లలిత అతనితో మాటలు తగ్గించేసింది. సూర్యం కాస్త శాంతించాడు.

ఈ పరిస్థితులలో తను తల్లి కాబో తుందన్న సంగతి తెలిసి సంతోషించాలో ఏడవాలో అర్థం కాకుండాపోయింది.

ఎప్పటి కప్పుడు సూర్యం తనను చిత్రహింసచేస్తున్నాడు కానీ అది తగ్గు తుందనే ఆశ ఎక్కడా కనిపించటంలేదు. నీరసంగా నిట్టూర్చింది.

ఆరాత్రి "నేను తల్లిని కాబోతున్నాను" అంటూ సహజమైన సిగ్గుతో పరవశంగా భర్తకు చెప్పింది.

అతని ముఖంలో ఆశించిన భావాలు ఎక్కడా లేవు.

"ఏమండీ! మాట్లాడరేం?" అడిగింది.

వింటున్న సూర్యం ఒక్కసారిగా ఎగిరిపడ్డాడు "నీకేం? ఎన్నిసార్లయినా తల్లివి అవుతావు. కష్టపడి చెమటోడ్చి సంపాదించే వాడినన్న జాలి నీకేమాత్రం అయినా ఉందా? నా కష్టంలో నువ్వు హాయిగా బ్రతుకుతున్నావ్ ఇక నీ పిల్లలు కూడా నా కష్టం తిని బ్రతకాలా?"

ఒక భర్త, తండ్రి కాబోతున్న వ్యక్తి నోటినుంచి వస్తున్న మాటలకు లలిత నివ్వెరపోయింది

"దీనికి కారణం మీరు కూడాను. మీరు మాత్రం పిల్లలు కారా?" కోపంగా అడిగింది

"ఛీ ఛీ పాడు సంత. నా మెడకు బండ." తిట్టుకుంటూ విసురుగా బయటకు వెళ్ళిపోయాడు.

శిలాప్రతిమలా బ్రమాన్పడి కూర్చుండి పోయింది లలిత. ఆ రాత్రి, మరునాడు పగలంతా కూడా సూర్యం ఇంటికి రాలేదు. రాత్రి ఎనిమిది అవుతుండగా వచ్చాడు. ఇంటికి తాళం వేసుంది. అది చూసి తెల్లబోయాడు. ఇంతలో ప్రక్కింటి అబ్బాయి వచ్చి "ఆంటీ వాళ్ళ నాన్నగారి ఇంటికి వెళ్తున్నానని చెప్పమని తాళం ఇమ్మన్నారు" అంటూ తాళంచెవి ఇచ్చాడు.

సూర్యం ఆశ్చర్యపోయాడు. 'ఎన్ని తిట్టినా మౌనంగా సహించే వ్యక్తే కానీ తొందరపడదే!' అనుకున్నాడు.

తాళం తీసి లోపలకు వచ్చాడు. పాత పెంకులు కావటంతో పైనుంచి దుమ్ము రాలి పడుతుంది. లలిత ఎప్పటికప్పుడు శుభ్రపరిచేది. ఈ రోజు ఇల్లంతా దుమ్ము పేరుకుంది.

పోతేపోయింది. ఇంక నేను సంపా దించేదంతా హాయిగా నేనే ఖర్చుపెట్టుకో వచ్చు అని సంతోషించాడు. పాంట్ తీసి లుంగీ కట్టుకుందామని ట్రంకుపెట్టె తీసాడు. లుంగీపై పేపర్. తీసి చదివాడు,

'మీకు లలిత వ్రాసేది. ఇటువంటి భయంకర బ్రతుకు నేను బ్రతుకలేను మీరన్నట్లు నా బిడ్డలు మీ చేతుల్లో నరకం చూడటం నేను భరించలేను. అందుకే వెళ్ళిపోతున్నాను — లలిత '

దాన్ని నలిపి నిర్లక్ష్యంగా ఒక మూలకు విసిరికొట్టాడు ఆకలిగా లేక అలాగే మంచంపై వాలి అలసటగా నిద్ర పోయాడు.

* * *

మర్నాడు ఉదయం ఇల్లంతా ఒకటే దుమ్ము. సూర్యంకు పిచ్చిగా ఉంది చీపురు పుచ్చుకుని సాధ్యమైనంతవరకు ఊడ్చాడు. చీపురు అరిగి అరిగి చాల చిన్నదిగా ఉంది. కొత్త చీపురు తెమ్మని



'ఈ మహా శిల్పాన్ని పూర్తి చేయలేని కారణం కమా అడిగారు. ఇదిగో ఇదీ.'

---

లలిత బ్రతిమాలటం గుర్తు వచ్చింది. కాఫీ పెట్టుకుందామని పుల్లల పొయ్యి వెలిగించటానికి ఏడున్నరకు ప్రయాసపడి వెలిగించాడు కాఫీ ఏమీ బాగులేదు. 'లలిత ఇచ్చే కాఫీ అమృతంలా ఉంటుంది' అనుకున్నాడు.

అన్నం వండాడు. మంట ఎక్కువయి తెలియక అది కాస్తా జావరూపం దాల్చింది దొండకాయవేపుడు చెయ్యబోతే చక్కగా మాడి మసిబొగ్గు అయిపోయింది స్నానం చేద్దామని పెరట్లోకి వెళ్ళాడు. రెండు బకెట్లు నీళ్ళు తోడేసరికి చేతులు ఒరుసుకుపోయాయి.

బాధగా 'అబ్బా!' అంటూ అరిచేతులు చూసుకున్నాడు. 'అమ్మో' నీళ్ళు తోడటానికి లలిత ఇంత బాధపడుతుందా' అనిపించింది

రెండు రోజులు గడిచాయి. సూర్యం స్థితి అధ్వాన్నంగా తయారయింది

అన్ని పనులు చెయ్యాల్సివస్తోంది. చివరకు గిన్నెలు కూడా కడుక్కుంటున్నాడు. బట్టలు ఉతుక్కుని మరీ కంపెనీకి వెళ్ళాల్సివస్తోంది. త్వరగా రమ్మని కంపెనీ వారు వార్నింగ్ కూడా ఇచ్చారు.

సూర్యం పనులతో నీరసించిపోయాడు. తను కష్టపడుతుంటే లలిత హాయిగా కూర్చుంటోంది అనుకున్నాడు. కానీ తను 'ఒక్క చేద నీళ్ళు తోడగానే ఆమె బాధ తెలిసింది. ఉద్యోగంలో పడే శ్రమలాంటి శ్రమే లలితదని, లలిత పడే కష్టం అనేది ఎలా ఉంటుందో, ఇంట్లో పనులు చెయ్యాలంటే లలిత కూడా శ్రమ పడుతోందని తెలిసి ఆమె పడే పాటు అనుభవంలోకి వచ్చింది.

ఈ అనుభవాల మధ్యనుంచి అతనికో చక్కని సత్యం తెలిసింది. మనిషి విలువలు అర్థం కాసాగినయ్.

లలితను తను హింసించటం ఎంత అన్యాయమో స్పష్టంగా తెలిసివచ్చింది.

'లలితా' నన్ను క్షమించు' బాధగా అనుకున్నాడు.

అప్పటికప్పుడు తయారై బయటకు వచ్చాడు.

* * *

లలిత సంధ్య దీపం వెలిగిస్తోంది. దీపం వెలుగులో ఎదురుగా కన్పించిన వ్యక్తిని చూడగానే నిశ్చేష్టిత అయింది,

"లలితా" లోకం మరచి అనురాగంగా పిలిచాడు. ఆ పిలుపులోని మార్దవానికి లలిత పులకించిపోయింది. అతన్ని అల్లుకుపోయింది.

సూర్యం మనస్సు నిర్మలంగా ఉంది.

అప్పుడే వెలిగించిన దీపం (లాంతరు) వారి అనురాగానికి సంతోషిస్తున్నట్లుగా మరింత కాంతి పుంజుకుని నవ్వుతూ ఉంది. ★